నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం | మార్చి 25, 2025 | www.navatelangana.com


## కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

- మళ్లీ అధికారంలోకి బీఆర్ఎస్ రాబోతుంది
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దుర్గారెడ్డి

**నవతెలంగాణ-నిజాంసాగర్**

కార్యకర్తలు అందరూ ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం బాన్సువాడకు ఇఫ్తార్ విందుకు బయలుదేరిన ఆమె మండలంలోని పిట్లం చౌరస్తా వద్ద బిఆర్ఎస్ కార్యకర్తలతో మాట్లాడారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు కాంగ్రెస్ పై తీవ్ర వ్యతిరేకంతో ఉన్నారని అన్నారు. పూర్తిస్థాయిలో ఏ ఒక్క రైతుకు కూడా రుణమాఫీ కాలేదని చెప్పారు. కార్యకర్తలు అధైర్య పడద్దని మళ్లీ అధికారంలోకి బిఆర్ఎస్ రాబోతుందని ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. కవితను కలిసిన వారిలో మాజీ ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి, రమేష్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి తదితరులున్నారు.

## ఈదురుగాలులతో విరిగిపడ్డ చెట్టు

- రోడ్డుపై కూలడంతో రాకపోకలకు అంతరాయం

**నవతెలంగాణ-లింగంపేట్**

లింగంపేట్ మండలంలోని ఒంటరిపల్లి గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై సోమవారం మధ్యాహ్నం వీచిన ఈదురుగాలుల ధాటికి రోడ్డుపై చెట్టుకూలింది. ఈదురు గాలులు వర్షం కారణంగా రోడ్డుపై చెట్టుకులడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లింగంపేట్ నుండి పోల్కంపేట్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు రోడ్డుపై వర్షంతోనే నిలిచిపోయారు.

పోతాయిపల్లి గ్రామానికి చెందిన యువకులు ఆకుల మోహన్ గేరబోయిన శంకర్ ప్రవీణ్ కర్నాకర్ లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్డుపై పడినటువంటి చెట్లను తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి.

# నిరసనలపై ఉక్కుపాదం

- కలెక్టరేట్ ఎదుట నిరసనలు చేపడితే చట్టరీత్యా చర్యలు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన పోలీసులు
- మండిపడుతున్న కార్మికులు, కార్మిక సంఘాలు




కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం వివిధ వర్గాల కార్మికులు కోరుకుంటుంటారు. అన్ని శాఖల కార్యాలయాలను ప్రస్తుతం కలెక్టరేట్‌కు తరలించడంతో తమ గోడును వెళ్లబోసుకునేందుకు కార్మికులు వచ్చి తమ నిరసన గళం వినిపించి వినతిపత్రం ఇద్దామని భావిస్తే వారికి పోలీసుల నుంచి ముందే హెచ్చరికలు జారీ అవుతున్నాయి. కలెక్టరేట్ ముందు, చుట్టుపక్కల ప్రాంతాలలో ఎటువంటి నిరసన కార్యక్రమాలు నిషేధించినట్టు దీనిని అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం గమనార్హం. ఏమైనా నిరసన కార్యక్రమాలు చేపట్టాలనుకుంటే మున్సిపల్ భవనం పక్కన స్థలం ధర్నాచౌక్‌కు కేటాయించామని, అక్కడ మాత్రమే ముందస్తు అనుమతులు తీసుకొని నిరసనలు చేయాలని, అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రూరల్ పోలీస్ స్టేషన్ పేరిట ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

ధర్నా చౌక్ వద్ద నిరసనలు చేపట్టి ఎవరికి వినతిపత్రం ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా కార్యాలయాల వద్ద ఆయా విభాగాలకు చెందిన కార్మికులు నిరసనలు చేపట్టి తమ గోడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుందని, కానీ కార్యాలయాలన్ని కలెక్టరేట్‌కు తరలించి.. నిరసనలు మాత్రం ఎక్కడో దూరంగా నిర్వహించుకోవాలని చెప్పడం ఎంత వరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. కామారెడ్డిలో కలెక్టరేట్ ప్రాంగణంలోనే ధర్నా చౌక్ ఏర్పాటు చేశారని, నిజామాబాద్‌లో సైతం కలెక్టరేట్ వద్ద స్థలం కేటాయించాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎరువు తయారీకి మంగళం



- నిరుపయోగంగా మారిన డంపింగ్ యార్డులు
- ఒకే చోట తడి, పొడి చెత్త సేకరణ
- ఊరవతలకు తీసుకెళ్లి కాల్చివేత
- ప్రత్యేకంగా ఓ కార్మికుడిని కేటాయిస్తేనే ఉపయోగంలోకి వచ్చే అవకాశం

**నవతెలంగాణ-నిజాంసాగర్**

గ్రామాలకు నిధుల సమీకరణతో పాటు పల్లెలు పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పొడి చెత్తతో వచ్చే వాటిని వేరే చేసి విక్రయించడంతో పాటు.. తడి చెత్తతో ఎరువు తయారు చేసి విక్రయించి జీపీలు స్వయంగా నిధులు సమకూర్చుకోవాల్సి ఉండగా.. డంపింగ్‌యార్డుల నిర్వహణను విస్మరించడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగా మారినట్టయింది. దీనికి తోడు తడి, పొడి చెత్తను ఒకే చోట సేకరించి.. ఊరవతలకు తీసుకెళ్లి కాల్చి వేస్తుండటం గమనార్హం. డంపింగ్ యార్డు నిర్వహణకు ప్రత్యేకంగా ఓ కార్మికుడిని కేటాయిస్తే తప్పా.. వాటిని ఉపయోగంలోకి తీసుకొచ్చే అవకాశం లేకుండా పోతోంది.

ఉమ్మడి నిజాంసాగర్ మండలం వ్యాప్తంగా 24 గ్రామపంచాయతీల్లో గత ప్రభుత్వ హయాంలో డంపింగ్ యార్డులు నిర్మించారు. ఒక్కో నిర్మాణానికి ఈజీఎస్ ద్వారా రూ.2.50 లక్షల చొప్పున కేటాయించి నిర్మాణాలు పూర్తి చేశారు. చెత్త సేకరణలకు గ్రామాలకు ట్రాక్టర్‌లను సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి.. డంపింగ్ యార్డుకు తీసుకెళ్లి అక్కడ చెత్తను వేరు చేయాల్సి ఉంటుంది. ప్లాస్టిక్ సామాను, పేపర్ ఇతరాత్ర పొడి చెత్తను వేర్వేరు చేసి డంపింగ్ యార్డులో ప్రత్యేకంగా నిర్మించారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను రెండు రకాలుగా సేకరించి ఎరువుల తయారీతో పాటు పొడి చెత్తను విక్రయించడం ద్వారా గ్రామాలకు లాభాలు సమకూర్చుకోవాలని ఉద్దేశంతో ప్రభుత్వం డంపింగ్ యార్డ్ లను నిర్మించింది. చిత్త సేకరణకు ప్రతి గ్రామానికి ట్రాక్టర్ ను సమకూర్చడంతో పాటు మల్టీపర్పస్ వర్కర్లను కూడా నియమించింది. రోజువారీగా ప్రతి ఇంటి తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ కు చేరవేయాలి. డంపింగ్ యార్డ్ వద్ద తడి, పొడి చెత్తను వేరు వేరు చేసి తడి చేత్తను నిలువ చేసి ఎరువులు తయారు చేయడం, పొడి చెత్తలో లభించే ఇనుము, ప్లాస్టిక్ తదితర వస్తువులను విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చాల్సి ఉంటుంది. తయారైన ఎరువును ఇతరులకు విక్రయించడం లేదంటే హరితహారం మొక్కలకు వినియోగించాల్సి ఉంటుంది. డంపింగ్ యార్డులు నిర్మించిన తొలినాళ్లలో చెత్త నుంచి తయారు చేసిన సిబ్బంది తదనంతరం వివిధ కారణాలతో విడిచిపెట్టారు.

**ఒకే చోట తడి, పొడి చెత్త సేకరణ**

తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాల్సి ఉన్నా.. ఒకే చోట సేకరిస్తున్నారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించకుండా గ్రామ శివారు ప్రాంతంలోకి తీసుకెళ్లి కాల్చివేస్తున్నారు. పలు చోట్ల డంపింగ్ యార్డులు ఊరి నుంచి చాలా దూరంలో ఉండటంతో అక్కడి వరకు వెళ్లేందుకు ఇక్కట్లు పడుతున్నారు. ఫలితంగా లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డులు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. ఫలితంగా చెత్తను సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యం నెరవేరడం లేదు. అధికారులు సైతం అంతగా దృష్టి సారించకపోవడం మూలంగా అనేక గ్రామాల్లో డంపింగ్ యార్డులు అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి.

**లక్షల నిర్మాణాలు వృథా**

డంపింగ్ యార్డు నిర్మించినా.. దీని నిర్వహణలకు అదనపు కార్మికులను కేటాయించలేదు. ఉన్న కార్మికులు ఇప్పటి రోడ్లు, మురికి కాలువలు శుభ్రం చేయడంతో పాటు హరితహారం మొక్కలకు నీళ్ల పట్టడం ఇతరాత్ర పనులతో తలకుమించిన భారం పడుతుంది. వీటికి తోడు చెత్త సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించే వరకు సమయం మధ్యాహ్నం దాటిపోతోంది. కాగా చిన్న గ్రామాల్లో ఎరువులు తయారు చేసే అంత చెత్త కూడా లభించడం లేదని కార్యదర్శులు చెబుతున్నారు. ఇతరాత్ర కారణాలతో డంపింగ్ యార్డులు విస్మరణకు గురైయ్యాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాఅయినట్టయింది.

చెత్తతో ఎరువులు తయారు చేస్తే కనీసం హరితహారం మొక్కలకైనా వేసి ఎందుకు అవకాశం లభిస్తుంది. అంతగా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం.. పంచాయతీ కార్యదర్శులు సైతం అంతగా దృష్టి సారించకపోవడం మూలంగా ఎరువుల తయారీ లక్ష్యం నెరవేరడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు దృష్టి సారించి అదనంగా కార్మికుడిని కేటాయించి డంపింగ్ యార్డులను ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఇంగ్లీష్ పరీక్షకు 56 మంది గైర్హాజరు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

పదో తరగతి పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 22,735 మందికి గాను 56 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్టు డీఈవో అశోక్ తెలిపారు. కాగా జిల్లా వ్యాప్తంగా 141 పదవ తరగతి పరీక్ష కేంద్రాలలో పరీక్ష ప్రశాంతంగా కొనసాగినట్టు తెలిపారు. ఎక్కడా కూడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా, మాల్‌ప్రాక్టీస్ కాకుండా అన్ని పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు ఎవరు ఆలస్యం రాకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు తెలిపారు. డిఈఓ 8 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్కార్డ్ 38 పరీక్షా కేంద్రాలను పర్యవేక్షణ చేశారని వివరించారు.

## నూతన మున్సిపాలిటిగా బిచ్కుంద

- అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి శ్రీధర్ బాబు
- ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు
- పటాకులు పేల్చి సంబరాలు చేసుకున్న నాయకులు, ప్రజలు



**నవతెలంగాణ-బిచ్కుంద**

జుక్కల్ నియోజకవర్గం లో ఒక్క మున్సిపాలిటీ కూడా లేకపోవడంతో బిచ్కుంద స్థానిక ప్రజల ఆకాంక్ష మేరకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాగా అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు బిచ్కుంద మున్సిపాలిటీగా ప్రకటించడంతో స్థానిక నాయకులు ప్రజలు పటాకులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మంత్రి శ్రీధర్ బాబుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సంబరాల్లో మునిగి తేలిన స్థానిక ప్రజలు నాయకులు బిచ్కుంద మున్సిపాలిటీ కోసం ఎంతో కృషి చేసిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపాలిటీగా బిచ్కుందను ప్రకటించడంతో అభివృద్ధితో పాటు సౌకర్యాలు మెరుగుకానున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 26 నుండి ఇంటర్ ఇతర పేపర్‌ల మూల్యాంకనం

- అధ్యాపకులను రిలీవ్ చేయాలి : డీఐఈవో

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

ఈనెల 26 నుండి బొటని, జోవాలజీ,కామర్స్, హిస్టరీ, కెమిస్ట్రీ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపూడి రవికుమార్ తెలియజేశారు. అధ్యాపకుల ఆర్డర్ కాపీలను ఇంటర్ బోర్డు ఆయా కళాశాల లాగిన్‌లలో నిక్షిప్తం చేసినట్లు తెలిపారు. వెంటనే తమ అపాయింట్మెంట్ ఆర్డర్లను డౌన్‌లోడ్ చేసుకొని 26న ఉదయం పది గంటలకు నిజామాబాద్ ఖిల్లా బాలుర జూనియర్ కళాశాల వద్ద మూల్యాంకన కేంద్రంలో అధ్యాపకులు రిపోర్టు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, ఆయా గురుకుల కళాశాల ల ప్రిన్సిపాల్ లు వెంటనే అధ్యాపకులను రిలీవ్ చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ ప్రిన్సిపాల్‌లు వెంటనే మూల్యాంకనం ఆర్డర్ కాపీలు వచ్చిన అధ్యాపకులను విధుల నుండి రిలీవ్ చేయనట్లయితే ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు కఠినమైన చర్యలు తీసుకుంటామని ఇంటర్ విద్య అధికారి స్పష్టం చేశారు. నాట్ అప్పాయింటెడ్ లిస్టులో ఉన్న అధ్యాపకులను కూడా మూల్యాంకనం విధుల్లోకి తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలియజేశారు.

## వర్షంతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేల పరిహారం

**సీఎం, మంత్రికి ధన్యవాదాలు తెలిపిన రూరల్ ఎమ్మెల్యే**

**నవతెలంగాణ-మోపాల్**

ఇటీవల కురిసిన అకాల వడగండ్ల వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల పంటలకు నష్టం వాటిల్లాయని, నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అసెంబ్లీలో సోమవారం ప్రస్తావించారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సానుకూలంగా స్పందించి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇవ్వడానికి ఒప్పుకున్నారు. దీంతో ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. అలాగే నిజామాబాద్ జిల్లా పసుపు, ఎర్ర జొన్నల రైతులపై మంచిప్ప ప్రాజెక్ట్ ఉద్యమంలో రైతుల పై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ప్రస్తావించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో అభ్యుదయ రైతులు , 400 ఎకరాల భూమి అందుబాటులో ఉన్నందున, నియోజకవర్గంలో నూతన వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పై ప్రస్తావనలకు ప్రభుత్వం సానుకూల స్పందించిందని ఎమ్మెల్యే తెలిపారు.

# ప్రజాపాలన అంటే అక్రమ అరెస్టులా?

- అరెస్టులతో ఆశాల ఉద్యమాలను ఆపలేరు
- నిర్బంధాలను ఖండిస్తున్నాం : సీఐటీయూ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నూర్జహాన్
- పలు చోట్ల ఆశాలు ముందస్తు అరెస్టు

**నవతెలంగాణ-కంఠేశ్వర్/తాడ్వాయి/జుక్కల్**

ప్రజాపాలన అంటే అక్రమ అరెస్టుల అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ప్రశ్నించారు. అరెస్టులతో ఆశాల ఉద్యమాలని ఆపలేరని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

తమ సమస్యల పరిష్కారం కోసం ఆశాలు.. ఆశా వర్కర్స్ యూనియన్( సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం చలో హైదరాబాద్ కోటిలోని కమిషనర్ కార్యాలయం ముట్టడికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తీవ్ర నిర్బంధకాండను ప్రయోగించి ముందస్తుగానే ఆశాలను అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. అయినా పోలీస్ నిర్బంధాలను ఛేధించి వేల మంది ఆశాలు డైరెక్టర్ ఆఫీస్ ప్రధాన గేట్ వద్ద బైఠాయించినట్టు తెలిపారు. జిల్లా నుంచి సైతం సీఐటీయూ నాయకులు, ఆశాలు నిర్బంధాలను ఛేదించి చేరుకున్నట్టు నూర్జహాన్ తెలిపారు. కాగా వందలాది మంది పోలీసులు అడ్డుకొని అక్రమ అరెస్టులు చేశారని, మహిళలని కూడా చూడకుండా మగ పోలీసులు ఆశాలను కొట్టి, గాయపరచి బలవంతం గా వ్యానుల్లో కుక్కారని తెలిపారు. అనేక మంది ఆశా వర్కర్ స్పృహ తప్పి పడిపోయినా పోలీసులు కనికరించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



నిర్బంధాలను ఛేదించి హైదరాబాద్ తరలిన నిజామాబాద్ జిల్లాలోని పలువురు ఆశాలు, సీఐటీయూ నాయకులు

అనేకమంది కాళ్ళు, చేతులకు గాయాల య్యాయి. ఆశాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కర్కశంగా ప్రవర్తించింది. ఈ అరెస్టులు, తోపులాటల్లో తనతో పాటు నిజామాబాద్ జిల్లా ఆశ నాయకులు రేణుక, సుకన్య, గీత, ఇందిరా, లావణ్య, రేణుక, రాధా, సువర్ణ, లక్ష్మి, స్వప్న, నర్సు లతో పాటు ఇతర జిల్లా ఆశా వర్కర్లకు వందలాది మందిని అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌లలో నిర్బంధించినట్టు తెలిపారు. ఆశాలకు కనీస వేతనం రూ.18 వేలు ఫిక్స్‌డ్‌గా నిర్ణయించి చెల్లించే వరకూ ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

**ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికుల ముందస్తు అరెస్టు**



తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌లో పలువురి అరెస్టు

**తాడ్వాయి** : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఆశా కార్యకర్తలను, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులను ఆదివారం రాత్రి స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. సోమవారం మధ్యాహ్నం వరకు స్టేషన్‌లోనే ఉంచారు. చాలీచాలని వేతనాలతో తాము దశాబ్ద కాలం పాటు పనులు చేస్తున్నామని పనికి తగ్గ వేతనం లేక తమ కుటుంబాలు ఇబ్బందులతో ఉన్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆశాలకు కనీస వేతనం రూ.18 వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, గుర్రాల సుజాత, పంబల్ల హంస, కన్నంటి జ్యోతి, అర్చన, జీజియా బాయ్, వనిత, సప్న, తదితరులన్నారు.

**జుక్కల్** : తమ సమస్య ల పరిష్కారం కోసం శాంతి యుతంగా నిరసన తెలిపేందుకు హైదారాబాద్‌కు బయలుదేరిన ఆశ కార్యకర్తలను ముందస్తు అరెస్టు చెయ్యడం సరైంది కాదని సి ఐ టి యు జిల్లా కమిటి సభ్యుడు సురేష్ గొండ తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదారాబాద్ లోని కోటి లొ గల కమిసినర్ కార్యలయం ముట్టడికి బయలు దేరిన ఆశ కార్యకర్తలను అరెస్టు చెయ్యడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెసు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిచ్కుంద, మద్నూర్, పిట్లం మండలాల్లోని ఆశ కార్యకర్తలను అరెస్ట్ చేసి ఆయా పోలీస్ స్టేషన్‌లకు తరలించినట్టు తెలిపారు.

# క్రికెట్ బెట్టింగ్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు

- బెట్టింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ రాజేశ్‌చంద్ర
- తమ పిల్లలను కనిపెడుతూ ఉండాలని తల్లిదండ్రులకు సూచన

**నవతెలంగాణ-కామారెడ్డి**

ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌లు పెడుతూ తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ రాజేశ్‌చంద్ర సూచించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పలువురు యువకులు మ్యాచ్ గెలుపు ఓటముల విషయములో పెద్ద మొత్తములో బెట్టింగ్ చేసే అవకాశం ఉన్నదనీ.. ఇలా చేయడం వలన కోలుకోలేని విధంగా ఆర్థిక నష్టం జరిగి చివరకు ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉందని అన్నారు. ప్రస్తుతం క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో తమ పిల్లల ప్రవర్తనలో ఏదైనా మార్పులు ఉన్నాయో తల్లిదండ్రులు గమనించాలని వారితో తరుచూ మాట్లాడుతుం డాలని సూచించారు. లేదంటే డబ్బులు, ప్రాణాలు పోయే అవకాశం ఉన్నదని, తమ కష్టార్జితాన్ని, కన్న బిడ్డలను బెట్టింగ్ విషయములో కోల్పో వద్దు అని చెప్పారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే



మాట్లాడుతున్న ఎస్పీ

అత్యాశతో పలువురు యువత ఆన్‌లైన్ బెట్టింగ్స్, ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ.. సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి, చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని కావున అందరూ వీటి భారీనా పడకుండా అప్రమత్తముగా ఉండాలని సూచిం చారు. క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు తెలిస్తే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

## ప్రజావాణికి 82 ఫిర్యాదులు

- సత్వరమే పరిష్కరించాలి : అధికారులకు కలెక్టర్ ఆదేశం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 82 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, మెప్మా పీ.డీ రాజేందర్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అక్రమంగా మొరం తవ్వకాలు

- మొరం మాఫియాపై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ డిమాండ్

**నవతెలంగాణ-కామారెడ్డి**



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ( రెవెన్యూ ) విక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వెంకట్ గౌడ్, కొత్త నరసింహులు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో అక్రమ మొరంతవ్వకాల జోరుగా కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులు వ్యాపారులతో కలిసిపోయారని విమర్శించారు. ఇప్పటికే కామారెడ్డి జిల్లాలో భూగర్భ జలాల అడుగంటి పోయాయని, అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేస్తూ వ్యాపారాలు నడుపుతున్న వారి పై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. ప్రధానంగా భిక్కనూర్, మాచారెడ్డి, రాజంపేట, బాన్సువాడ, ఎల్లారెడ్డి, దోమకొండ, మండలాల్లో మొరం లారీలు కండ్ల ముందు తిరుగుతున్నా.. చూసి చూడనట్టుగా అధికారులు వ్యవహరిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంటనే ఆర్డీవోలకు ఆదేశాలిస్తూ జిల్లాలో మొరం తవ్వకాలు ఎక్కడెక్కడ జరుగుతున్నాయో తెలుసుకొని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నవతెలంగాణ
నిజామాబాద్ 2
మంగళవారం | మార్చి 25, 2025 | www.navatelangana.com

## కార్మికుల అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

నిన్న రాత్రి నుండి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తు మధ్యాహ్న భోజన కార్మికుల ఇండ్ల మీద దాడులు చేస్తూ నోటీసులు ఇస్తూ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని ఏఐటియుసిగా తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వానికి రాష్ట్ర ఆర్థిక శాఖా మాత్యులు భట్టి విక్రమార్క, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అపాయింట్మెంట్ ఇచ్చి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై చర్చించడానికి ఆహ్వానించిందన్నారు. రాష్ట్ర నాయకులు మంత్రులను కలిసి సమస్యలపై చర్చించడానికి వెళ్తున్న నేపథ్యంలో కార్మికులను భయభ్రాంతులకు గురి చేసే పద్ధతుల్లో స్కూళ్లలో వంటలు చేయకుండా పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా 10వేల రూపాయల వేతనాన్ని అమలు చేయాలని, ప్రమాద నష్టపరిహారం భీమా చట్టాన్ని అమలు చేయాలని, డిమాండ్ చేశారు. . సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు రాధా కుమార్, రాజేశ్వర్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వాది పట్ల జాగ్రత్తలు వహించాలి

**నవతెలంగాణ-నవీపేట్**



క్షయ వ్యాధి పట్ల జాగ్రత్తలు వహిస్తే ప్రమాదం నుండి తప్పించుకోవచ్చని వైద్య సిబ్బంది రోగులకు క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సోమవారం సూచనలు చేశారు. క్షయ వ్యాధి సోకిన వారికి ప్రభుత్వమే ఉచితంగా మందులు అందించడం జరుగుతుందని అన్నారు. మూడు నుండి ఆరు నెలల వరకు మందులు వాడితే ప్రమాదం నుండి తగ్గించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు సునీత, సవిత, స్వరూప, లింక్ వర్కర్ వడ్డే రవి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి ఎల్ఓసి అందజేత

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

మండలంలోని పడకల్ గ్రామంలోగల చమ్మటి సత్యనారాయణ కొడుకు రుత్విక్ రాజ్ అనారోగ్యంతో బాధపడుతున్న సీఎం సహాయ నిధి రూ. 40వేల ఎల్ఓసిని బాధితుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు జితేష్ అందజేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబం డాక్టర్ భూపతి రెడ్డికి, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పడకల్ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు ఇర్ల జితేష్ కాంగ్రెస్ పార్టీ మండల బీసీ నాయకుడు కొప్పుల మహిష్, నాయకులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థి అకాల మరణం

- మౌనంపాటించిన విద్యార్థులు

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

మండలంలోని ప్రాథమిక పాఠశాల తొర్లికొండకు చెందిన పూర్వ విద్యార్థి ఆరేటి అక్షయ్ కుమార్ ఆదివారం మరణించాడు. దీంతో పాఠశాలలో విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రధాన ఉపాధ్యాయులు జంగం అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళి అర్పించారు.

## రామలింగేశ్వర స్వామి దేవాలయంలో భక్తుల సందడి

**నవతెలంగాణ-ఆర్మూర్**

మండలంలోని పిప్రి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవాలయం వద్ద సోమవారం భక్తుల సందడి నెలకొంది. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను సైతం ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన సుంకం భూషణ్ సేవ కార్యక్రమాల్లో భాగంగా తన వంతు సహాయం అందిస్తున్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు జేఏసీ నాయకుల అరెస్టు

**నవతెలంగాణ-ఆర్మూర్**

జగిత్యాల జిల్లా రైతు జేఏసీ తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమం దృష్ట్యా ఆర్మూర్ రైతు జేఏసీ నాయకులను అరెస్టు చేసి ఆర్మూర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. రైతు జేఏసీ నాయకులు లింగారెడ్డి మాట్లాడుతూ ముందస్తు అరెస్టులను ఖండిస్తున్నామని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## తడి చెత్త, పొడిచెత్త సేకరణపై అవగాహన

**నవతెలంగాణ-ఆర్మూర్**

పట్టణంలోని 18వ వార్డు మహిళలకు తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వడం, సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను నిషేధించడం గురించి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2024 ఫీడ్ బ్యాక్‌ను చేయించడం నిర్వహించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, మెప్మా ఆర్పి, మున్సిపల్ సిబ్బంది రవి, ప్రశాంత్ కాలనీ మహిళలు పాల్గొన్నారు

## పాఠశాలకు 10 కంప్యూటర్లు మంజూరు

**నవతెలంగాణ-బాల్కొండ**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలనే ఉద్దేశంతో పీఎంశ్రీ పథకం ద్వారా మండల పరిధిలో మొదటి విడతలో ఎంపికైన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పది డెస్క్ టాప్ కంప్యూటర్లు, ఒక ప్రింటర్, పది హెడ్ ఫోన్స్, రెండు కేవీ ఇన్వర్టర్ల చొప్పున (సుమారు 7 లక్షల విలువ గల) సామాగ్రిని సోమవారం పాఠశాలకు అందజేశారని ఎంఈఓ బట్టు రాజేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలలో కంప్యూటర్ విద్య విద్యార్థుల కెరీర్ అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. ఇంటర్నెట్‌తో కూడిన కంప్యూటర్ విద్య విద్యార్థులకు కొత్త నైపుణ్యాలు, ప్రస్తుత పాఠాల అధునాతన వెర్షన్ను నేర్చుకోవడానికి దోహద పడుతుందని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

జక్రాన్‌పల్లి మండల పరిధిలో అర్గుల్ గ్రామంలో యజ్ఞ జూనియర్ కాలేజీ పేరుతో సొసైటీని చేసి అనుమతి పొందినట్లు చేసి సర్వేనెంబర్ 291లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసిన వారిపై చర్యలు తీసుకొని గ్రామ సమిష్టి అవసరాలకు కేటాయించాలని పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చి ప్రతినిధి బృందం మధుసూదన్ మేకల రమేష్, బి. దేవారం, గొల్ల రాజ గంగారాం, మహేష్, కలికోట నరేష్ తదితరులు వెళ్లి కలెక్టర్‌ను కలిసినట్టు తెలిపారు. గ్రామస్తులు ఇంటర్మీడియట్ బోర్డుకు వెళ్లి యజ్ఞ జూనియర్ కాలేజ్ పేరుతో అర్గుల్గ్ శివారులో ఏమైనా అనుమతి పొందిన సమాచారం కోరగా ఈ పేరుతో ఎలాంటి అనుమతులు లేవని, కాలేజీలు నడుస్తలేవని రాతపూర్వకమైన సమాచారాన్ని అందించారని తెలిపారు. ప్రతిని కలెక్టర్‌కు అందించడం జరిగిందని అన్నారు. సొసైటీ కాలేజీ అర్గుల్ గ్రామంలో నిర్మించకుండా ముందుగానే ప్రభుత్వానికి నామినల్ డబ్బు చెల్లించి కొనుగోలు చేసినట్లుగా భవిష్యత్తులో అమ్ముకునే విధంగా 25 సంవత్సరాల క్రితం ప్లాన్ రూపొందించుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. 30, 40 లక్షలు రూపాయల మొరాన్ని అమ్ముకున్నారని, ఇది చట్ట విరుద్ధమని వీరిపై చర్య తీసుకోవాలని, వీరికి చేసిన ఐదు ఎకరాల భూమిని రద్దుచేసి గ్రామ సమస్య అవసరాల కేటాయించాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు. దీంతోపాటు శివారులోగల భూమి మాదని తప్పుడు పద్ధతులను చూయించి ప్రభుత్వాన్ని మోసం చేసిన వారిపై కేసు పెట్టాలని కోరారు. గ్రామస్తులపై పెట్టిన కేసులు రద్దుచేయాలని కలెక్టర్ విన్నవించారు. కలెక్టర్ స్పందిస్తూ వెంటనే ఆర్డీవో గారికి విచారణకు ఆదేశించారని గుర్తుచేస్తూ కలెక్టర్ గారికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## రెండు లక్షల పైన రుణాలు రుణమాఫీ చేయాలి

**మండల మాజీ ఎంపీపీ అనంత్ రెడ్డి**

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

రెండు లక్షలపైన రుణాలను వెంటనే రుణ మాఫీ చేయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని ఒప్పించి వ్యవసాయశాఖ మంత్రి రుణాలు మాఫీ చేయించాలని మండల మాజీ ఎంపీపీ అనంత్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో మాజీ ఎంపీపీ అనంతరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంకా కొంతమందికి రెండు లక్షలలోపు ఉన్న వారికి కూడా రుణమాఫీ కాలేదని, రెండు లక్షల పైన రుణాలు ఉన్నవారికి తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం మొత్తం 42 లక్షల రైతులకు గాను 31 కోట్ల వేల రూపాయలు రుణమాఫీ చేయవలసి ఉండగా 20వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని, ఇంకా 17 లక్షల మందికి 11 వేల కోట్లు రుణమాఫీ చేయాలని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రుణమాఫీ పై వినకపోతే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతుల పక్షాన ముఖ్యమంత్రిని ఒప్పించి వెంటనే రుణమాఫీ చేయించాలని కోరారు.

## ప్రతినెల 5వ తేదీలోగా
# జీపీ కార్మికులకు వేతనాలివ్వండి

- టియుసిఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**




కలెక్టరేట్ ఎదుట ధర్నాచేస్తున్న నాయకులు

పంచాయతీ కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.రమేష్, జిల్లా నాయకులు బి.మురళి అన్నారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) ఆధ్వర్యంలో నిజామాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ కార్మికులకు ప్రతి నెల 5వ తారీఖు లోపు జీతాలు ఇస్తామని హామీ ఇచ్చి 18 నెలలు గడుస్తున్న నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. జనవరి నెల నుండి కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెల 5వ తారీఖున జీతాలను వారి ఖాతాలో వేస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు హామీని అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్‌గా 5 లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగుల తరహా 30శాతం పిఆర్సి అమలు చేయాలని, జీవో నెంబర్ 51 సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పంచాయతీ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారంగా 16,500 వేతనాన్ని ఇవ్వాలని, జన శ్రీ బీమాను వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఆందోళనలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో టియుసిఐ జిల్లా నాయకులు సత్యమ్మ నాయకులు అరవింద్ రాజేశ్వర్ పంచాయతీ కార్మికులు మహేష్, రాము, చింటూ సురేష్, బాలు, నరేష్, గంగాధర్, భోజన్న, శ్రీకాంత్, రమేష్, లింగం, రాజేశ్వర్ , సాయిలు, దుర్గ తదితరులు పాల్గొన్నారు

## రాజీవ్ యువ వికాసం పథకంలో ఎస్సీ,ఎస్టీలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

రాజీవ్ యువ వికాసం పథకంలో ఎస్సీ,ఎస్టీలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో జిల్లా జాయింట్ కలెక్టర్ లోకల్ బాడీస్ అథారిటీస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆదివాసి హక్కుల పోరాట సమితి, తుడుం దెబ్బ నిజామాబాద్ జిల్లా కమిటీ, మీడియా ఇంచార్జి కట్టా నరేశ్ కుమార్ నాయక్ మాట్లాడుతూ...నిరుద్యోగ యువతకు జీవన ఉపాధిని పెంపొందించే రాజీవ్ యువ వికాసం పథకంలో నిజామాబాద్ జిల్లా షెడ్యూల్ క్యాస్ట్, షెడ్యూల్ తెగల (ఎస్సీ, ఎస్టీ)కి చెందిన నిరుద్యోగ యువతి, యువకులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ఆదివాసులకు పథకాలు అందడంలేదన్నారు. అధికారులు ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాల గురించి ఆదివాసుల గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి రాజీవ్ యువ వికాసం పథకం యొక్క విధివిధానాలను వివరించాలని కోరారు. ఎస్సీ ఎస్టీ నిరుద్యోగ, షెడ్యూల్ క్యాస్ట్ షెడ్యూల్ తెగలకు చెందిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు కార్యక్రమంలో శ్రీనివాస్, గంగాధర్, మోపాల్ మండల ఇన్చార్జి ఎఱ్ఱం నాగేష్, పల్లె ప్రభుదాస్, నిజామాబాద్ రూలర్ ఇంచార్జ్ అన్నం మహేష్, ఎడ్ల గంగా ప్రసాద్, సాయిలు, రవికుమార్, సమాద్ బాయ్, సయ్యద్ ఖదీర్, రాజు కుమార్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు

## గిరిరాజ్ కళాశాల ఎస్సీ హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలి

గిరిరాజ కళాశాల ఎస్సి హాస్టల్‌కు నూతన భవన నిర్మించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారం రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిరాజ్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఎస్సీ హాస్టల్ చాలా సంవత్సరాల క్రితం కట్టిందని, శిథిలావస్థకు చేరుకొని పైఉచ్చులు ఊడుతూ విద్యార్థులపై పడుతున్న పరిస్థితి నెలకొందని, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న పరిస్థితి ఉందని, వెంటనే నూతన బిల్డింగ్ మంజూరు చేసి సమ్మర్‌లో పనులు ప్రారంభించాలని, నిజామాబాద్ నగరంలో వేలమంది ఎస్సీ విద్యార్థులు వివిధ రకాల చదువులు చదువుతున్నారని, ప్రస్తుతం ఎస్సీ పోస్ట్ మెట్రిక్ బాయ్స్ విద్యార్థులకు రెండు హాస్టల్ మాత్రం ఉన్నాయని, హాస్టల్ సౌకర్యం లేనందువల్ల విద్యార్థులు ప్రైవేట్ హాస్టల్స్ రూములలో ఉంటున్నారని కావున మరొక ఎస్సీ హాస్టల్ ఎస్సి(సి ) కట్టాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ నాయకులు మనోజ్, సాయికిరణ్, గౌతం, చరణ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు పాటుపడదాం

- క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ

**నవతెలంగాణ-కంఠేశ్వర్**




ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా టీబీ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుండి చేపట్టిన ఈ ర్యాలీని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. నర్సింగ్ విద్యార్థినులు, వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి ఆయన ర్యాలీలో పాల్గొన్నారు. టీబీ అంతం మనందరి పంతం.. క్షయ వ్యాధి నిర్మూలనకు పాటుపడదాం అని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. క్షయ వ్యాధి నిర్మూలనకు చేపడుతున్న చర్యల గురించి, వ్యాధి లక్షణాలు, పాటించాల్సిన జాగ్రత్తలు, చికిత్సా విధానం గురించి టీబీ నియంత్రణ విభాగం అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం, జిల్లా టీబీ నియంత్రణ విభాగం కో ఆర్డినేటర్ రవిగౌడ్, నర్సింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థినులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిరంతరం ప్రజ్వలిస్తున్న కాగడ భగత్‌సింగ్

- భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా కాగడాల ప్రదర్శన

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**



భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలో ద్వారక నగర్ ఐఎఫ్‌టీయు కార్యాలయం నుంచి భగత్ సింగ్ చౌరస్తా (సాయిరెడ్డి పెట్రోల్ బంకు) వరకు ప్రజాసంఘాలు పిడిఎస్‌యూ, పివైఎల్, ఐఎఫ్టియు, పిఓడబ్ల్యు ఆధ్వర్యంలో భగత్ సింగ్‌ను స్మరిస్తూ కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి పరుచూరి శ్రీధర్ మాట్లాడుతూ.. భగత్‌సింగ్ వారసత్వాన్ని కొనసాగించడం అంటే ఈ దేశంలో ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల హక్కుల రక్షణకు ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆనాడు విదేశీయుల దోపిడి పోవాలని చెప్పి భగత్‌సింగ్ తన ప్రాణాలను ఇచ్చారని తెలిపారు. నేడు స్వదేశీ పేరు చెబుతూ విదేశీ జపం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువకులు ఈ దేశ ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. కులం, మతాన్ని రెచ్చగొడుతూ ఇంకొకరిని అణచివేసే పద్ధతిని ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు కూడు, గుడ్డ, తిండి అందించడానికి ప్రయత్నించకుండా విద్వేషాలు రెచ్చగొడుతున్నా యన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్వేషాలకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా ఉద్యమించి ఈ దేశాన్ని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబా, హెచ్ఆర్ఎఫ్ కార్యదర్శి జి. రమేష్, అడ్వకేట్ అన్వేష్, పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, ఐఎఫ్టియు నగర కార్యదర్శి శివకుమార్, పిఓడబ్ల్యూ నగర అధ్యక్ష కార్యదర్శులు నీలం లక్ష్మి, సంజన, పివైఎల్ నాయకులు భాస్కర్, పిడిఎస్‌యూ నాయకులు మనోజ్, సాయి కిరణ్, నాందేవ్, రాజు, వంశి, ప్రవీణ్, ఐఎఫ్టి నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## జీవనశైలిలో మార్పులతోనే
# టీబీ బారిన పడుతున్నాం

- మెడికవర్ ఆసుపత్రి వైద్యులు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**



టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మన జీవన శైలిలో మార్పులతో టీబి వ్యాధి బారిన పడుతున్నామని మెడికవర్ హాస్పిటల్స్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. టీబి నియంత్రణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని వారు చెప్పారు. తమ వంతు బాధ్యతగా మెడికవర్ హాస్పిటల్ తరపున ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రపంచ టీబి దినోత్సవాన్ని పురస్కరించుకొని మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీబిని క్షయ అని కూడా అంటారని తెలిపారు. అయితే టీబీ అనేది దగ్గుతో మొదలవుతుందని తరచుగా రెండు నుండి మూడు వారాలపాటు దగ్గు, తెమడ వస్తుంటే నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించి తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం వైద్యులను సంప్రదించి వారి సూచన మేరకు మందులు వాడాలని తెలిపారు. ఒక్కసారి క్షయ వ్యాధి బారిన పడ్డప్పుడు ఆ వ్యాధి రూపాంతరాలుగా మారుతూ ఉంటుందని అన్నారు. కానీ క్షయ వ్యాధి రాగానే సరైన సమయంలో సరైన విధంగా మందులు వాడినట్లయితే వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టిబి బారిన పడ్డవారి కోసం పోషకాహారం అందించేందుకు డబ్బులతో సహా ఉచితంగా మందులను సైతం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఒకసారి వ్యాధి బారిన పడ్డ ప్రస్తుతం ఉన్న టెక్నాలజీకి అనుగుణంగా చాలా రకాల వైద్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. కేవలం వైద్యులు సూచించిన సూచనలు వినడమే కాకుండా పాటించినప్పుడే ఆరోగ్య వంతులుగా ఉండడం సాధ్యమవుతుందని తెలిపారు. టీబీలో ఫస్ట్ స్టేజ్ సెకండ్ స్టేజ్ చాలా రకాల స్టేజీలు ఉంటాయన్నారు. వాటికి భయపడాల్సిన అవసరం లేదని, సరైన వైద్యం, హారం తీసుకున్నట్లయితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని సూచించారు. ఈ వ్యాధి చిన్న పిల్లల నుండి పెద్దవారికి కూడా వచ్చే ఆస్కారం ఉంటుందని తెలిపారు. అయితే పెద్దవాళ్ల ఆహారపు అలవాట్లు వ్యాయామం యోగా లాంటివి చేయకపోవడం, ధూమపానం లాంటివి చేయడం వల్ల తొందరగా ఈ వ్యాధి బారిన పడతారని చెప్పారు. ఎప్పుడైతే రెండు నుండి మూడు వారాల వరకు తెమడతో కూడిన దగ్గు ఉండడం అలాగే శరీరంలో మార్పులు రావడం గుర్తించి వెంటనే వైద్యుని సంప్రదించినట్లయితే వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చన్నారు.



పాల్గొన్న పలువురు

## ఎన్నికల విధుల బకాయిలు చెల్లించాలి

- తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న గెజిటెడ్ అధికారులు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగుల బకాయిలు అందని అధికారులకు గౌరవ వేతనం చెల్లింపుకు సంబంధించి ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఒక వినతిపత్రం సమర్పించామని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు సోమవారం తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే సెక్షన్ ఆఫీసర్‌తో ఈ విషయాన్ని సమీక్షించి, ఆలస్యం చేయకుండా ప్రధాన ఎన్నికల అధికారికి నివేదిక సమర్పించాలని ఆదేశించారని అన్నారు. ఈ విషయంలో తీసుకున్న త్వరిత చర్యను టీజీవో సంఘం తరపున అభినందిస్తున్నామని టీజీవో అధ్యక్షులు అలుక కిషన్ తెలిపారు. అదేవిధంగా కలెక్టర్ కాంప్లెక్స్‌లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించడానికి ఐడిఓసీలో సోలార్ ప్యానెల్‌లను ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ చొరవ ఇంధన సామర్థ్యం, స్థిరమైన పాలనా పద్ధతులకు దోహదం చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న వాహన స్టాండ్ గురించి ఆందోళనలను లేవనెత్తగా ఇక్కడ వాహనాలు ప్రస్తుతం సరైన షెల్టర్ లేకుండా చాలా వేడి పరిస్థితుల్లో పార్క్ చేయబడ్డాయన్నారు. సౌకర్యాన్ని మెరుగుపరచడానికి, వాహనాలకు తగిన రక్షణ కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. సంబంధిత వారందరి ప్రయోజనం కోసం ఈ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తారని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అలుక కిషన్, కార్యదర్శి సంఘం అమృత్ కుమార్, కోశాధికారి దేవిసింగ్, దండు స్వామి,చందర్,రామస్వామి, కీర్తిరాజ్, ఆఫీస్ బేరర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మహాసభలు జయప్రదం చేయండి

- సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్
- ప్రచార జాత ప్రారంభం



ప్రచార జాతాను ప్రారంభిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గల సిపిఐ పార్టీ కార్యాలయం ఆవరణలో నిజామాబాద్ జిల్లాలో ఈనెల 25, 26, 27 తేదీల్లో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మూడో మహాసభలను జయప్రదంలో భాగంగా జిల్లాలో రైతుల్లో, ప్రజల్లో ప్రచారం చేయడానికి, ప్రచార జాతను సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో గోనే రెడ్డి ఫంక్షన్ హాల్‌లో రేపు రైతు సంఘం రాష్ట్ర మహాసభల ప్రారంభ సూచికంగా బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ బహిరంగ సభలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై మాట్లాడటానికి సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జాతీయ, రాష్ట్ర నాయకులు నాయకులు పాల్గొంటారని అన్నారు. ఈ సభకు జిల్లాలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై చర్చతో పాటు జిల్లాకు సంబంధించిన చెరుకు, పరిశ్రమలు, పసుపు, ఎర్ర జొన్న, వరి, తదితర పంటల రైతుల సమస్యలపై ప్రధానమైన చర్చ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వై.ఓమయ్య, నాయకులు రాధాకుమార్, మహేష్, కోయేడి నర్సింలు, శ్రీరాములు గౌడ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
మంగళవారం | మార్చి 25, 2025 | www.navatelangana.com

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

**నవతెలంగాణ-నిజాంసాగర్**
మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, నిజాంసాగర్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ఏలే మల్లికార్జున్ చేతుల మీదుగా లబ్దిదారులకు సోమవారం అందించినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో పిట్లం సీనియర్ నాయకులు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సలాబత్‌పూర్ మారుతి మందిర్ పాలకమండలి నియామకం

- చైర్మెన్‌గా రామ్‌పటేల్



**నవతెలంగాణ-మద్నూర్**
కామారెడ్డి జిల్లాలో ప్రఖ్యాత గాంచిన మూడు రాష్ట్రాల సరిహద్దులో గల మద్నూర్ మండలంలోని సలాబత్పూర్ మారుతి మందిర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ పాలక మండలి నూతన కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ కమిటీ చైర్మన్‌గా రామ్ పటేల్ పెద్దశక్కర్గ, ఉష్కల్వర్ శ్రీనివాస్ శంకర్, తోటవార్ నాగనాథ్ ఇరవంత్ రావు, ఇంగులే కుశాల్ రావు రామారావు, పటేల్ పండరి పటేల్ నారాయణ, కాకాని కైలాష్ సత్యనారాయణ, రామస్వామి లక్ష్మీబాయి రామస్వామి మారుతిని నూతన పాలకమండలిగా నియమించారు.

# ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- కామారెడ్డి ప్రజావాణికి 131 ఫిర్యాదులు
- ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్
- పలు మండలాల్లోనూ ప్రజావాణి

**నవతెలంగాణ-కామారెడ్డి**
ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల విజ్ఞాపనలను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. పలు సమస్యలపై (131) అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన అర్జీల పెండెన్సీలను సంబంధిత అధికారులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటివరకు 20,370 అర్జీలు రాగా, ఆయా అధికారులు పరిశీలించి 19,567 అర్జీలను పరిష్కరించడం, చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.


కామారెడ్డి : ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

803 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వచ్చే వారంలోగా పరిష్కరించాలని అన్నారు. అదేవిధంగా పెండింగులో ఉన్న ధరణి దరఖాస్తులను పరిశీలించి డిస్పోజ్ చేయాలని తహసీల్దార్లు, ఆర్డీఓలను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సిద్ధంగా ఉంటే వెంటనే మార్క్ అవుట్ ఇవ్వాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు పరిశీలించాలని, ఎంపీడీఓలు, ఎంపీఓలు పర్యవేక్షించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ మాట్లాడుతూ.. రేషన్ కార్డుల కోసం మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటిని రెవి న్యూ ఇన్‌స్పెక్టర్ ద్వారా, ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వాటిని ఎంపీడీఓ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్‌లు విచారణ చేయాలని తెలిపారు. ఈ ప్రజావాణిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ వీణ, జడ్పీ సీఈవో చందర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదుల్ నిల్..**
దోమకొండ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులేమీ రాలేదని తహసిల్దార్ సంజయ్‌రావు తెలిపారు. ప్రజలు రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజావాణికి ఫిర్యాదులు నిల్..**
తాడ్వాయి : తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసిల్దార్ రహీముద్దీన్ తెలిపారు. ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగిందని ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీఓ సవితరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి నరసింహులు, విద్యాశాఖ అధికారి రామస్వామి, డబ్ల్యూఎస్, ఐసిడిఎస్, ట్రాన్స్‌కో, ఏపీఎం మనోహర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మళ్లీ మొదటికే.. ప్రజావాణిలో నలుగురే

**నవతెలంగాణ-మద్నూర్**
మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఎవరో ఒక అధికారి గైర్హాజరవుతూనే ఉన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కేవలం నలుగురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. ప్రజావాణిలో తహసిల్దార్ హాజరుకాలేదు. పూర్తిస్థాయిలో అధికారులు హాజరయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## గొల్లపల్లికి సాగు నీరు అందించాలి

**నవతెలంగాణ-రామారెడ్డి**
మండలంలోని గొల్లపల్లి గ్రామ శివారులో గల వ్యవసాయ భూమి సాగుకు ఎల్లారెడ్డి చెరువు నుండి 360 ఎకరాలు పంటలు పండేవాని, పంటకు నీళ్ల విడుదల చేయాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో పాల మల్లేష్, కందిరి రాజయ్య, కట్లకుంట బాలరాజు, నేరాలు చిన్న లింబాద్రి, మస్కట్ మల్లేష్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఒకే వ్యక్తి రూ.8 లక్షల లోన్ తీసుకోవడంపై విచారణ జరపాలి

**నవతెలంగాణ-కామారెడ్డి**
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మెప్మాలో అవినీతి కొనసాగుతుందని ఒక వ్యక్తి 8 లక్షల లోన్ తీసుకున్నాడని టీఎల్ఎఫ్ మాజీ అధ్యక్షురాలు లతా సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మెప్మా కార్యాలయంలో ఎంట్రీ చేసి రూ.8లక్షల లోన్ తీసుకున్న వ్యక్తిపై, ఆ లోన్ ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆర్టీసీ బోధన్ డిపో మేనేజర్‌గా విశ్వనాథ్



**నవతెలంగాణ-నిజామాబాద్**
టీజీఎస్ ఆర్టీసీ బోధన్ డిపో మేనేజర్‌గా విశ్వనాథ్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆసిఫాబాద్ డిపో నుంచి బోధన్‌కు బదిలీపై వచ్చిన డిపో మేనేజర్ విశ్వనాథ్ బాధ్యతలు స్వీకరించారు. బోధన్‌లో విధులు నిర్వహించిన శ్రీనివాస్ కరీంనగర్-2 డిపోకు బదిలీపై వెళ్లారు. ఈ మేరకు నూతన డిపో మేనేజర్ విశ్వనాథ్‌ను బోధన్ డిపో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## స్కూటీని ఢీకొన్న కారు

- కారు డ్రైవర్‌కు జైలుశిక్ష

**నవతెలంగాణ-నిజామాబాద్**
బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రవి గార్డెన్ సమీపంలో సోమవారం కారును నిర్లక్ష్యంగా నడిపి స్కూటీని ఢీకొనడంతో స్కూటీ నడుపుతున్న వ్యక్తి గాయాల పాలయ్యాడు. ఈ ఘటనలో పట్టణ సీఐ వెంకటనారాయణ కేసు నమోదు చేసుకుని నిందితుడు కారు డ్రైవర్ అయిన షేక్ ముగ్దుమ్‌కు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి శేషతల్పసాయి అతనికి 6 రోజుల పాటు జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానాను విధించారు.

## ఎల్లారంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభం


నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

**నవతెలంగాణ-లింగంపేట్**
మండలంలోని ఎల్లారం గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోసి శ్రీకారం చుట్టినట్టు ఎంపీడీవో నరేష్ తెలిపారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎల్లారం గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంచుకున్నట్టు వివరించారు. జిల్లా అధికారుల ఆదేశానుసారం ఎల్లారం గ్రామంలో నలుగురు లబ్దిదారుల ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోసినట్టు తెలిపారు. గృహ నిర్మాణశాఖ అధికారుల ఆదేశానుసారం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేపడుతున్నట్టు వివరించారు. ఇందిరమ్మ లబ్దిదారులు అధికారుల సూచనలు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మలారి, హౌసింగ్ డిఇ సుభాష్, ఏఈ అశోక్, కార్యదర్శితో పాటు గ్రామస్తులున్నారు.

## బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్


అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు

**నవతెలంగాణ-రాజంపేట్**
మండల కేంద్రంలో ఆదివారం రాత్రి పిఎసిఎస్ చైర్మన్ ఆముదాల రమేష్, మాజీ వార్డ్ మెంబర్ స్వామిని ఆదివారం రాత్రి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కాలేదని సోమవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న వారిని ముందస్తు అరెస్టు చేశారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రతి రైతుకూ బోనస్ వర్తింపజేయాలి

- సొసైటీ మహాజన సభలో తీర్మానం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**నవతెలంగాణ-నిజామాబాద్**
ప్రతి రైతుకూ ప్రభుత్వం బోనస్ వర్తింపజేయాలని పెంటకలాన్ సహకార సంఘంలో జరిగిన మహాజన సభలో రైతులు సోమవారం తీర్మానం చేశారు. అధ్యక్షులు దొనకంటి రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన మహాజన సభలో సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన లావాదేవీలను, ఆదాయ, వ్యయాలను వివరించారు. రైతు భరోసా 5 ఎకరాలపైన వారికి కూడా ఇవ్వాలని రైతులు తీర్మానించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ ఉపాధ్యక్షులు భుడిమే శివకుమార్, డైరెక్టర్లు సార్గం పోతారెడ్డి, బొల్లెపల్లి రాము, ఆవుల సుబ్బారెడ్డి, యాతాలం దమ్మయ్య, కొండపల్లి చిన్న గంగాధర్, గోనె లస్మవ్వ, తాళ్ల రమేష్‌గౌడ్, మాజీ సర్పంచులు తాల్వేద రమణ, బోయి లక్ష్మయ్య, బర్దీపూర్ మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, ఏఈఓ సరోజ, సంఘం కార్యదర్శి షేక్ బాబా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు పద్మాజీవాడిలో తైబజార్ వేలం

**నవతెలంగాణ-సదాశివనగర్**
మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో మంగళవారం తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ సోమవారం తెలిపారు. ఎంపీఓ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తైబజార్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తైబజార్‌లో పాల్గొనేవారు గ్రామపంచాయతీ వద్దకు హాజరుకావాలని సూచించారు. గత సంవత్సరం నిర్వహించిన తైబజార్ కంటే ఎక్కువగా ఉంటుందని తెలిపారు. తైబజార్ దక్కించుకున్న వారు తైబజార్ పాటలో సగం డబ్బులు చెల్లించవలసి ఉంటుందని సూచించారు.

## పోచారం గ్రామాన్ని సందర్శించిన డీఎల్‌పీవో


గ్రామాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**
మండలంలోని పోచారం గ్రామంలో సోమవారం ఎల్లారెడ్డి డిఎల్‌పిఓ సురేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా డ్రైనేజీని పరిశీలించారు. గ్రామపంచాయతీ రికార్డులను, అంగన్వాడీ సెంటర్లను తనిఖీ చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

# రోడ్లపైనే ఆటోలు.. ప్రయాణికులకు ఇబ్బందులు

- పట్టించుకోని ట్రాఫిక్ అధికారులు

**నవతెలంగాణ-మద్నూర్**
ఇటు తెలంగాణ అటు మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో గల మద్నూర్ మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య నెలకొంది. పాత బస్టాండ్ ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. పాత బస్టాండ్ చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు కరువవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఆటో యజమానులు రోడ్లపైనే ఆటోలు నిలిపివేస్తుండటంతో ఎటు నుంచి ఎటు వెళ్లాలో ప్రయాణికులకు అర్థంకాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడంతో పాత బస్టాండ్ సమీపంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా మద్నూర్ పాత బస్టాండ్ వద్ద చౌరస్తా తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధాన చౌరస్తా అయినందున నిత్యం ప్రయాణికుల రద్దీ ఉంటుంది. అయితే ట్రాఫిక్ పోలీసులు స్పందించి ముందు జాగ్రత్తగా ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.


రోడ్డుపై ఆగి ఉన్న ఆటోలు

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి

**నవతెలంగాణ-ఎడపల్లి**
ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి అన్నారు. సోమవారం ఎడపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతుల పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్‌ను అందించడం హర్షనీయమన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను నూర్పిడి చేసిన అనంతరం కొనుగోలు కేంద్రాలలో దాన్యం విక్రయిస్తే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2300తో పాటు, క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్‌ను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.
రైతుల ఖాతా లోకి నేరుగా ప్రభుత్వం డబ్బులను జమ చేస్తుందని ఆయన గుర్తుచేశారు. రైతులు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్ రూ.500 అందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతుల కష్టాలను తెలుసుకున్న బోధన్ నియోజకవర్గ శాసన సభ్యులు పి.సుదర్శన్‌రెడ్డి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషి చేయడం పట్ల ఆయనకు రైతులు, నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి రాజారాం, సిబ్బంది ప్రభాకర్‌గౌడ్, సాయిలు, రైతులు శంకర్‌గౌడ్, గెంటి పెద్ద మల్కన్న, నాయుడు పోతున్న, దూసగంగాధర్, బోల్గం శంకర్, తూటి కూర ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోల మల్కారెడ్డి

## మండల కేంద్రాన్ని రెండుగా విడదీయొద్దు


వినతినిస్తున్న గ్రామస్తులు

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**
నేషనల్ హైవే ద్వారా నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారి ఏర్పాటు కారణంగా మండల కేంద్రం రెండుగా విడిపోతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న జాతీయ రహదారికి మండల కేంద్రంలో యూటర్న్ ఎక్కడ కూడా లేకపోవడంతో మండల కేంద్రాన్ని రెండుగా విడదీస్తున్నట్లు జాతీయ రహదారి పని కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. మండల కేంద్రంలో మూడు చోట్ల డివైడర్ కటింగ్ ఇవ్వాలని తద్వారా రెండు వైపులా ప్రజలు తిరగడానికి వెసులుబాటుగా ఉంటుందని, డివైడర్ కటింగ్ ఇవ్వకపోవడంతో కిలోమీటర్ దూరం నుంచి యుటర్న్ తీసుకోవాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు.

## ప్రమాదవశాత్తు నివాసపు ఇల్లు దగ్ధం


దగ్ధమైన నివాసపు ఇల్లు

**నవతెలంగాణ-పోతంగల్**
మండలంలోని కల్లూరు గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో నివాసపు ఇల్లు దగ్ధమైంది. మొత్తం నష్టం రూ.3,00,000 నష్టపోయినట్టు అంచనా వేసినట్టు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. బీర్కూర్ భారతి, గంగారాం సోమవారం ఉదయం ఇంటిలో పూజ కార్యక్రమాలు ముగించుకుని కూలీ పనికి వెళ్లారు. దేవుడి చిత్రపటాల వద్ద వెలిగించిన దీపం ప్రమాదవశాత్తు కింద పడడంతో, మంటలు చెలరేగి రేకుల ఇంటితో పాటు, బట్టలు, నగదు, బంగారు, వెండి ఆభరణాలు, వస్తువులు పూర్తిగా కాలిపోవడంతో ఆస్తి నష్టం జరిగిందని, కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## టీబీ వ్యాధి నివారణపై అవగాహన


టీబీ నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

**నవతెలంగాణ-నిజాంసాగర్**
క్షయ (టీబీ) వ్యాధిని ప్రాథమిక దశలోనే గర్తించి సరైన వైద్యం అందిస్తే తొందరగా నియంత్రించవచ్చునని నిజాంసాగర్ మండల వైద్య అధికారి డాక్టర్ రోహిత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు టీబీ వ్యాధి నివారణ, గుర్తింపు, చికిత్స మొదలగు విషయాల గురించి ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధుమేహం, పొగ తాగే వ్యక్తులు, 60 ఏళ్ల పైబడిన వారు వంటి క్షయవ్యాధి అధిక ప్రమాదానికి గురైన వర్గాలు అందుబాటులో ఉన్నప్పుడల్లా అడల్ట్ బిసిజి టీకాను తీసుకోవాలని ఆయన ప్రోత్సహించారు. అనంతరం డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ ఊహ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో మధుమేహం, హైపర్ టెన్షన్ రోగులతో మాట్లాడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెంకటనారాయణ, మధుసూదన్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-రామారెడ్డి**
మండలంలోని గోకుల్ తండాలో సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మోహన్ నాయక్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గం శాసనసభ్యులు మదన్మోహన్ రావు సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.15 లక్షల నిధులతో పనులు ప్రారంభించామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, పీర్‌సింగ్, గంగారాం, శంకర్ నాయక్, మహిపాల్, వసంత్, తాండవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఆంగ్ల పరీక్ష

**నవతెలంగాణ-సదాశివనగర్**
మండలంలోని నాలుగు సెంటర్లలో పదవ తరగతి ఆంగ్ల పరీక్షలు నిర్వహించారు. సోమవారం ఆంగ్ల పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సదాశివనగర్‌లో నాలుగు సెంటర్లున్నాయి. అన్ని సెంటర్లలో విద్యార్థులు ఆంగ్ల పరీక్షకు హాజరైనట్టు మండల విద్యాశాఖ అధికారి యూసఫ్ తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
4
మంగళవారం | మార్చి 25, 2025 | www.navatelangana.com

## ఏర్గట్ల కేజీబీవీని సందర్శించిన ఆర్మూర్ డీఎల్పీఓ



**నవతెలంగాణ-ఏర్గట్ల**
ఏర్గట్ల మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సోమవారం ఆర్మూర్ డీఎల్పీఓ, స్పెషల్ ఆఫీసర్ శివకృష్ణ సందర్శించారు.పాఠశాలలోని వంట గదిని, విద్యార్థుల భోజనానికి ఉపయోగించే వంట సరుకులను పరిశీలించారు. నాణ్యమైన బోజనాన్నే విద్యార్థులకు అందించాలని ఎస్ఓ సంధ్యారాణికి సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయినుల హాజరపట్టికలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాకీర్ పాల్గొన్నారు.

## ఆలూరులో పశువుల ఆరోగ్య సంరక్షణ శిబిరం

**నవతెలంగాణ-ఆర్మూర్**
ఆలు మండల కేంద్రంలో సోమవారం ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువుల ఆరోగ్య సంరక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 23 గేదెలకు, 20 దూడలకు, 40 మేకలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్ మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్య సంరక్షణ రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని, భవిష్యత్తులో మరిన్ని ఆరోగ్య శిబిరాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పశు వైద్యాధికారి డా. సందీప్ రెడ్డి పశువుల పరిరక్షణ, వ్యాధుల నివారణ, సరైన ఆహారం అందించడంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్, డైరెక్టర్లు మల్లారెడ్డి, శేఖర్ రెడ్డి , రవి, అమృతరావు, ఆలూరు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్, మండల పశు వైద్యాధికారి డా. సందీప్ రెడ్డి, ఇతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉపకేంద్రంలో బ్రేకర్ ఏర్పాటు



బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఆర్మూర్ డివిజనల్ ఇంజనీర్

**నవతెలంగాణ-బాల్కొండ**
బాల్కొండ మండల పరిధిలోని బోదేపల్లి గ్రామంలో 33/11 కె.వి విద్యుత్ ఉపకేంద్రంలో నూతనంగా విసిబి బ్రేకర్ ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన విసిబి బ్రేకర్‌ను సోమవారం ఆర్మూర్ డివిజనల్ ఇంజనీర్ పివి.రాజేశ్వర్ ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్ కిషన్, సబ్ ఇంజనీర్ మహేష్, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ సుందర్ రావు, లైన్ ఇన్స్పెక్టర్ రవీందర్, లైన్ మెన్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు

మండల కేంద్రంలోని పలు వీధుల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు అధికారులు ఫెన్సింగ్ కంచెలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, పలు వీధుల్లో జన సంచారం ఉన్నచోట ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ వేయడం జరిగిందని అసిస్టెంట్ ఇంజనీర్ కిషన్ తెలిపారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లకు కంచెలను సోమవారం అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

**(టీయుసీఐ)**
**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**
తెలంగాణ ప్రగతిశీల భవన మరియు ఇతర నిర్మాణరంగ కార్మిక సంఘం రాష్ట్ర 3వ మహాసభ పోస్టర్లను టీయుసీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రామిక భవన్, కోటగల్లి వద్ద సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయుసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత కరువైందన్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులందరికీ లేబర్ కార్డులు అందించాలన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను పెంచాలన్నారు. కార్మికులందరికీ బైకులను అందజేయాలన్నారు. ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రైవేటు కంపెనీలకు అప్పగించే యత్నాలను ఆపాలన్నారు. సంక్షేమ బోర్డులో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవడం రాష్ట్ర మహాసభలో చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుంటారన్నారు. ఈనెల 25న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జరిగే తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణరంగ కార్మిక సంఘం రాష్ట్ర 3వ మహాసభను జయప్రదం చేయాలని జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయుసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్, నాయకులు పి.రవి, డి.కిరణ్, సాయన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సంత వేలం

**నవతెలంగాణ-ముప్కాల్**
మండల కేంద్రంలో డైలీ మార్కెట్ రోజు వారీ సంత తైబజార్ సోమవారం ఉదయం 11గంటలకు వేలంపాట స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. గతంలో చేపట్టిన తైబజార్ నిర్వాహకులు ఈ సారి నిర్వహించిన పాటలో పాల్గొనలేదని పంచాయతీ సెక్రటరీ మల్లేష్ యాదవ్ తెలిపారు. స్థానికులు బొట్ల చిన్న రాజన్న ఒక్కరే వేలం పాటలో పాల్గొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం పంచాయతీ కార్యాలయంకు ఆదాయం వచ్చేలా రూ.1,03,058 రూపాయలకు సంత ఇవ్వడం జరిగిందన్నారు. రెండు మడిగెల అద్దె కోసం గ్రామస్తులు ముందుకు రాకపోవడంతో వాయిదా వేశమన్నారు. త్వరలోనే తేదీని తెలుపుతామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ గౌస్ మోహినోద్దీన్, పంచాయతీ సెక్రటరీ మల్లేష్ యాదవ్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## పోలీస్ కమిషనర్‌ను కలిసిన వివేకానంద యూత్ సభ్యులు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**
వివేకానంద యూత్ జిల్లా అధ్యక్షులు రూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య నిజామాబాద్ డిసిపి బస్వరెడ్డి లను హుస్సేన్‌తో పాటు పలువురు సభ్యులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హుస్సేన్, జహీర్, అస్లం ఖాన్, డాక్టర్ సజ్జత్, ఎల్లసాని లతా రవీందర్ రెడ్డి, రితేష్, తదితరులు పాల్గొన్నారు.




సీపీతో వివేకానంద యూత్‌సభ్యులు

## అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి

**నవతెలంగాణ-ఆర్మూర్**
అర్హులైన పేదలకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు నిజమైన అర్హులను గుర్తించి.. పథకాలను అర్హులకే అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. సీనియర్ మంత్రులు ఈ విషయంపై దృష్టి సారించాలన్నారు. ఏ పథకాలైన నిజమైన పేదలకే అందజేయాలని కోరుకుంటున్నానని అన్నారు.

## రైతు నాయకుల ముందస్తు అరెస్టులు

**నవతెలంగాణ-ముప్కాల్**
రుణమాఫీ, రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని రైతు సంఘాల నాయకులు చేపట్టిన ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు బయల్దేరి వెళ్తున్న ముప్కాల్ మండల రైతు నాయకులను పోలీసులు సోమవారం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ముందస్తు అరెస్ట్ అయిన వారిలో రైతు నాయకులు నిమ్మల శ్రీనివాస్, గడ్డం సంతోష్ రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సురేష్, పోలీసు శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

- బాల్కొండ నియోజకవర్గ పర్యవేక్షకులు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్
- జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సన్నాహక కార్యక్రమాలు

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ఏర్గట్ల/భీంగల్‌రూరల్**
కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సన్నాహక సమావేశాలు సోమవారం బాల్కొండ నియోజకవర్గంలోని కమ్మర్ పల్లి, మోర్తాడ్, భీంగల్‌లోన సహస్ర ఫంక్షన్‌హాల్లో, ఏర్గట్ల మండలాల్లో నిర్వహించారు. ఆయా మండలాల్లో కాంగ్రెస్ పార్టీ మండల శాఖల ఆధ్వర్యంలో ఈ సన్నాహక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బాల్కొండ నియోజకవర్గ పర్యవేక్షకుడిగా ఉన్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సొసైటీ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్, తదితరులు పాల్గొని మాట్లాడారు. పది సంవత్సరాలుగా బిజెపి ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందన్నారు. రాజ్యాంగ రచయిత అంబేద్కర్ పై, స్వాతంత్ర్య ఉద్యమ రథసారథి మహాత్మా గాంధీపై నీచంగా వ్యాఖ్యలు చేస్తుందని మండిపడ్డారు. ప్రజలు ఉమ్మడిగా మరో సత్యాగ్రహాన్ని చేయాలని రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునివ్వడంతో గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడతామని నాయకులు, కార్యకర్తల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి బల్మూరి వెంకట్

**ఏర్గట్ల:** మండలకేంద్రంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ అనే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, టీజీఎండీసి చైర్మన్ ఈరవత్రి అనిల్, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ పేరుతో గ్రామాల్లో పాదయాత్రలు చేపట్టి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేసి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గొప్పతనాన్ని ప్రజలకు చాటి చెప్పాలని అన్నారు. కార్యకర్తలు, నాయకులు నిత్యం ప్రజల్లో ఉండాలని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోమదేవరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడెం గంగాప్రసాద్, కమ్మర్ పెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ రవిరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేండ్ల రమేష్, డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్,మాజీ జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, మండల మైనార్టీ అధ్యక్షులు మునీరోద్దీన్, గ్రామశాఖ అధ్యక్షులు రేండ్ల రాజారెడ్డి, నాయకులు గడ్డం లింగారెడ్డి, ముస్కు మోహన్ రెడ్డి,పన్నాల నర్సారెడ్డి, బద్దం లింగారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

### భగత్‌సింగ్ స్ఫూర్తితో
# డ్రగ్స్‌కి వ్యతిరేకంగా పోరాడాలి

- అడ్వకేట్ శ్యాం బాబు
- డ్రగ్స్ నిర్మూలనకోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సెమినార్

**నవతెలంగాణ-కంఠేశ్వర్**
భగత్ సింగ్ పోరాట పటిమతో విద్యార్థులు డ్రగ్స్‌కి వ్యతిరేకంగా పోరాడాలని అడ్వకేట్ శ్యాంబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటిఐ గర్ల్స్ కళాశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పించి డ్రగ్స్ నిర్మూలనకోసం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ శ్యాం బాబు మాట్లాడుతూ.. భగత్ సింగ్ త్యాగానికి, సుఖ్ దేవ్ స్నేహానికి, రాజు గురుల అమరత్వానికి నేటికీ 94 ఏండ్లు అవుతుందని గుర్తు చేశారు. విద్యార్థులు భగత్ సింగ్ పోరాటపటిమను అలవర్చుకుని ఈ దేశాన్ని మతతత్వ పోకడల నుండి కాపాడాలని ఆయన సూచించారు. భగత్ సింగ్ 23 ఏళ్ల ప్రాయంలోనే ఈ దేశానికి స్వాతంత్రం తేవాలి అనే కాంక్షతో ఉరికంభాన్ని ముద్దాడాడని అన్నారు. చిన్నపిల్లలు డ్రగ్స్ పెడలర్స్‌గా మారి వారి జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని ఆయన అన్నారు. యువత డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటాలు, ప్రజలను చైతన్యం చేయడంలో ముందుండాలని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణకు అందరూ పాటుపడాలని కోరారు. జాతీయ విద్యా విధానం రద్దుకోసం పోరాటాలు నిర్వహించాలని అన్నారు. జాతీయ విద్యా విధానం పేరుతో కేంద్రం కాషాయీకరణను చొప్పించేందుకు ప్రయత్నం చేస్తూ భగత్ సింగ్ లాంటి వారి చరిత్రలను వక్రీకరించడం సబబు కాదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ వర్ధంతిని అధికారికంగా జరపాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక, జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, రాజు, ఐటిఐ కళాశాల కార్యదర్శి చరణ్, రోహిత్, రేవంత్, సంతోష్, లింబాద్రి, సర్థక్ తదితరులు పాల్గొన్నారు.



భగత్‌షింగ్‌కు నివాళ్లు అర్పిస్తూ..



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

## నాణ్యమైన భోజనం అందించాలి

- ఎంపిడిఓ రాములు నాయక్



సరుకులను పరిశీలిస్తున్నఎంపీడీవో

**నవతెలంగాణ-మోపాల్**
విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపిడిఓ రాములు నాయక్ అన్నారు. మండలంలోని ముదక్‌పల్లి గ్రామంలోని ఎస్‌టి హాస్టల్‌ను ఎంపీడీవో రాములు నాయక్, ఎంపీవో కిరణ్ కుమార్‌తో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో తెలిపారు. మండలంలోని పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వంటశాల పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందచేస్తున్నారా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూర్య సురేష్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణ నిరోధంపై అవగాహన

**నవతెలంగాణ -ఏర్గట్ల**
మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యలో మానవ అక్రమ రవాణా అరికట్టడంపై ఏపీఎం శ్యామ్ ఆధ్వర్యంలో సోమవారం మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ... మండలంలోని అన్ని గ్రామాల స్వయం సహాయక సంఘాల్లో, గ్రామ సంఘాల అధ్యక్షులు, మానవ అక్రమ రవాణా అనే అంశంపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీల ద్వారా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ మొదలైన సోషల్ మీడియా యాప్‌ల ద్వారా, ఏఐ టెక్నాలజీతో మహిళలను సైబర్ నేరగాళ్ళు మోసం చేస్తున్నారని, సైబర్ నేరాలకు గురయ్యామని అనుమానం వస్తే వెంటనే 1930 అనే సైబర్ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు వసంత, సీసీలు సంతోష్, నవీన్, అకౌంటెంట్ సుప్రియ, గ్రామ సంఘాల అధ్యక్షులు, వివోఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం

# 150 పాత వంగడాల ప్రదర్శన

- భారత్ క్రిషక్ సమాజ్ కౌన్సిల్ మెంబర్ల సమావేశంలో చిన్నికృష్ణుడు

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**
మధ్యప్రదేశ్‌లో భారత్ క్రిషక్ సమాజ్ 68వ కౌన్సిల్ మెంబర్ల సమావేశం క్రి షక్ సమాజ్ అధ్యక్షులు అజయ్ జక్కర్ ఆధ్వర్యంలో నిర్వహించినట్టు ప్రకృతి వ్యవసాయదారుడు నాగుల గంగారం అలియాస్ చిన్నికృష్ణుడు తెలిపారు. మధ్యప్రదేశ్ ఉజ్జయిని నగరంలో భారత దేశంలోని 16, 17 రాష్ట్రాల నుంచి వెయ్యి మంది రైతులు హాజరు కాగా తెలంగాణ నుండి ఐదుగురు రైతులు సుభాషిని, నాగుల గంగారం, రవీందర్, ప్రదీప్ రెడ్డి, అశోక్ హాజరయ్యారని చిన్ని కృష్ణుడు తెలియజేశారు. సమావేశంలో ఏ రాష్ట్రంలో ఎలాంటి వ్యవసాయం చేస్తున్నారు అనే విషయాలను, వారి వారి అనుభవాలను పంచుకున్నట్టు తెలిపారు. తమిళనాడు ఒరిస్సా రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేస్తున్నామని తెలియజేశారన్నారు. నిజామాబాద్ జిల్లా చింతలూరు గ్రామానికి చెందిన నాగుల గంగారాం పండించిన పాతకాలపు 150 రకాల వంగడాలను ప్రదర్శించగా 16 ,17 రాష్ట్రాల నుంచి వచ్చిన రైతులు తిలకించి కొనుగోలు చేశారని తెలిపారు.



ప్రదర్శనను తిలకిస్తున్న పలురాష్ట్రాల రైతులు

## 20 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

**నవతెలంగాణ కంఠేశ్వర్**
నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో 21 క్వింటాళ్ల పిడిఎస్ రైస్‌ను పట్టుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సిఐ అంజయ్య సోమవారం తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ రావు నేతృత్వంలో సిఐ అంజయ్య, ఎస్సై గోవింద్, సిబ్బంది వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీక్లీ మార్కెట్, శ్రీ సాయి కిరాణా షాప్‌పై రైడ్ చేసి 20 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ స్వాధీనం చేసుకున్నామన్నారు. దాని విలువ సుమారుగా లక్ష రూపాయలు ఉంటుందని, తదుపరి చర్యల నిమిత్తం వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించినట్లు తెలిపారు.

## ప్రతి నెల వేతనాలు చెల్లించాలి


- ఎంపీడీవోకు కారోబార్ల వినతి

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**
మండలంలోని అన్ని గ్రామ పచాయతీల సిబ్బంది వేతనాలు ప్రతినెల చెల్లించాలని కారోబార్లు సోమవారం ఎంపిడిఓ సతీష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కారోబార్లు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కారోబార్, మిగతా సిబ్బంది వేతనాలు సరైన సమయానికి అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పెరుగుతున్న ధరలవల్ల వేతనాలు కూడా సరిపోవటం లేదని, నిధుల విడుదల ఆలస్యం అయితే జీపీ నిధులనుండి చెల్లించేలా అనుమతించటానికి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. కార్యక్రమంలో మండల కారోబార్స్, జీపి సిబ్బంది పాల్గొన్నారు.

## నృత్య ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

- ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్' కైవసం

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**
మండల కేంద్రానికి చెందిన శ్రీ పరమేశ్వర నృత్య కళానిలయం విద్యార్థులు హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియం బిర్లా సైన్స్ సెంటర్ వేదికగా కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది విశిష్ట పురస్కార నృత్య పోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చారు. శ్రీ పరమేశ్వర నృత్య కళానిలయం కూచిపూడి నాట్య గురువు గంట శిరీష వద్ద నృత్య శిక్షణ పొందిన కళాకారులు శివాని, నమ్రత, బి.భవ్య శ్రీ, లావణ్య, మధుశ్రీ, అక్షర, రిషి ప్రియ, మిథిల దేవి, చైత్ర, భువనేశ్వరి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన ఇచ్చారు. ఉత్తమ ప్రదర్శనతో మొదటి బహుమతి పొందిన కళాకారినులు నటరాజ ప్రతిమతో పాటు సర్టిఫికెట్ అవార్డు అందించారు. ఉత్తమ ప్రదర్శననిచ్చిన కళాకారులను నిర్వాహకులు అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ పరమేశ్వర నృత్య కళానిలయం కూచిపూడి నాట్య గురువు శిరీషను వెంకటేశ్వర స్వామి అవార్డు, శాలువాతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఉగాది విశిష్ట పురస్కార నృత్య పోటీల్లో అద్భుత నృత్య ప్రదర్శన ఇచ్చిన శ్రీ పరమేశ్వర నృత్య కళానిలయం విద్యార్థులు 'ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్' కూడా కైవసం చేసుకున్నారు.భాస్కర ఆడిటోరియం బిర్లా సైన్స్ సెంటర్ వేదికగా కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది విశిష్ట పురస్కార నృత్య పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ కైవసం చేసుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. నాట్య గురువు శిరీష విద్యార్థులను నృత్యం నేర్చుకునేలా ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.



## న్యాయవాది హత్య హేయమైన చర్య

**నవతెలంగాణ-కంఠేశ్వర్**
రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాది ఈశ్రాయేల్ ఎర్రబాపు దారుణ హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ తెలిపారు. ఈ హత్యతోనైన న్యాయవాదులు రక్షణ చట్టం ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ఎర్ర బాపు హత్య న్యాయవాద వృత్తి, న్యాయవ్యస్థల పట్ల చేసిన క్రూరమైన నేర చర్యగా జగన్ పేర్కొన్నారు. న్యాయవాదులు ఇలాంటి దాడులకు గురి కావడం ఆందోళన కలిగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. హత్య ఘటనపై త్వరితగతిన నేర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎర్రబాపు కుటుంబానికి న్యాయవాద సమాజం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. హత్యకు పాల్పడిన వారిని చట్టం ముందు దోషులుగా నిలబెట్టి చట్ట ప్రకారం శిక్షించే వరకు విశ్రమించబోమని జగన్ పేర్కొన్నారు.

## రెండు లక్షల రైతు రుణమాఫీ చేయాలి

**నవతెలంగాణ-ఆర్మూర్**
ఎలక్షన్ లో ఇచ్చిన హామీ మేరకు ప్రతికుటుంబానికి రెండు లక్షల రైతు రుణమాఫీ చేయాలని రైతు నాయకులు, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ ఇటేడీ లింగారెడ్డి సోమవారం అన్నారు. రైతుభరోసా ఎకరానికి 12వేలు చెల్లించాలని, సన్న వరి ధాన్యానికి బోనస్ రానివారికి వెంటనే చెల్లించాలని డిమాండ్‌తో చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తుండగా తమతోపాటు రైతు సోదరులను ఎక్కడికక్కడ అక్రమ అరెస్ట్ లు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం అని గద్దెనెక్కిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా నిరసనలను అక్రమ అరెస్ట్‌లతో అణచివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అందరికి రెండులక్షల రుణమాఫీ అయ్యేవరకు రైతుభరోసా చెల్లించేవరకు సన్నధాన్యానికి బోనస్ రాని ఇంకా చాలామంది రైతులకు బోనస్ చెల్లించే వరకు తమ ఉద్యమం ఆగదని అన్నారు. వెంటనే హామీలను నెరవేర్చాలని లేని పక్షంలో రైతు ఉద్యమం తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు

## అడ్లూర్ ఎల్లారెడ్డి నూతన గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో సోమవారం నూతన గ్రామ అభివృద్ధి కమిటీని ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అధ్యక్షులుగా మూదాం సత్యంతో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ముదాం సత్యమును గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.


ఎన్నికైన నూతన వీడీసీ

## కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో అమ్మ ఒడి

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో సోమవారం కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య సేవలు నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ డా.సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని గర్భిణులకు ప్రతేకంగా అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా శిబిరం నిర్వహించి, మందులు పంపిణి చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే సాధారణ ప్రసవం గురించి అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

# రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశ మనుగడ సాధ్యం



మాట్లాడుతున్న నాయకులు

- అందుకే జైబాపు, జైభీమ్, జైసంవిధాన్
- దేశవ్యాప్తంగా ఒక యజ్ఞంలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం
- కాంగ్రెస్ నాయకుల వెల్లడి

నవతెలంగాణ-కామారెడ్డి

భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గానూ ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సోమవారం కామారెడ్డి పట్టణంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్, సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. దీనికి అబ్జర్వర్లుగా కామారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్, ఓబీసీ జాతీయ ఉపాధ్యక్షుడు కత్తివెంకటస్వామి, బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర గిరిజన శాఖ కార్పొరేషన్ చైర్మన్ కొట్నక తిరుపతి, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ నరేష్ జాదవ్, ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజ్ పాల్గొన్న ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా కైలాస్ శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అంబేద్కర్‌ను అవమానిస్తూ రాజ్యాంగాన్ని కించపరిచేలా బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లు ఏవిధంగా వ్యవహరిస్తున్నాయో ప్రజలకు తెలియజేయడానికే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అంబేద్కర్‌పై చేసిన అవమానకరమైన వ్యాఖ్యలకు గాను హోంమంత్రి అమిత్ షాను పార్లమెంట్ నుంచి బర్తరఫ్ చేయాలనేదే తమ ప్రధాన డిమాండ్ అన్నారు. జిల్లా అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు ప్రతి వాడవాడలో ఇంటింటికి తిరిగి మన రాజ్యాంగ అవశ్యకతను తెలుపుతూ మహాత్మాగాంధీ, అంబేద్కర్, రాజ్యాంగాన్ని చేత పట్టుకొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరకంగా నిరసనలు తెలిపి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. గాంధేయ మార్గంలో ఊరురా పాదయాత్ర చేపట్టాలని అన్నారు. పాదయాత్రలో జాతీయ జెండాతో మహాత్మాగాంధీ చిత్రపటం, అంబేద్కర్ చిత్రపటంతో పాటు రాజ్యాంగం తీసుకెళ్లాలన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశమనుగడ సాధ్యమని తెలిపారు. కేంద్రంలోని బిజెపి రాజ్యాంగ విలువలను కాలరాస్తూ మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావాలని ప్రయత్ని స్తుందన్నారు.

మతవాదుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలంటే మరోసారి గాంధేయ మార్గంలో జైబాబు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ పేరుతో గ్రామగ్రామాన పాదయాత్రలు చేపట్టాలని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ప్రతి గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. అంబేద్కర్ గొప్పతనాన్ని చాటి చెప్పి మన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఈ కార్యక్రమానికి హాజరైన వాళ్లందరిచే ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనని, పనిచేయని పార్టీ నేతలపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలంటే ఈ పాదయాత్రలో పాల్గొని ప్రజల బాగోగులు తెలుసుకొని వారి సమస్యలు వెలికితీస్తేనే మనం విజయం సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అనుబంధ సంస్థ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డ్‌మెంబర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

## నేడు జీపీ కార్మికుల చలో హైదరాబాద్

- జయప్రదం చేయండి : సీపీఐ(ఎం) కార్యదర్శి నన్నేసాబ్


మాట్లాడుతున్న నన్నేసాబ్

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)

జీపి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మార్చ్ 25న చేపట్టనున్న జీపి కార్మికులు చలో హైదరాబాద్ కార్యక్రమానికి గ్రామపంచాయతీ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) కార్యదర్శి నన్నేసాబ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి యేషాల గంగాధర్, జీపి కార్మికులు శంకర్, గంగారం, లక్ష్మి, సాయవ్వ తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం


మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 30 ఏండ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ జరిగిందని మాదిగ జర్నలిస్ట్ ఫోరం జిల్లా నాయకులు కుంటోళ్ల యాదగిరి మాదిగ అన్నారు. సోమవారం మండలంలోని పోచారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంబేద్కర్ విగ్రహానికి, పద్మ శ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు మార్చి 20న నిండు శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లును అమలు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. 30 ఏళ్లుగా సుదీర్ఘ పోరాటం ఫలితం కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి హయంలో శాసనసభల్లో బిల్లు ఆమోదం పెట్టారని ఈ నెల నుండి ప్రభుత్వం ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్లు వేసినా వర్గీకరణతోనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తొంట సాయిలు మాదిగ, ప్రధాన కార్యదర్శి కుంటోళ్ల రాజు, సహాయ కార్యదర్శి రాజుపేట రవి, ప్రచార కార్యదర్శి నాగరాజు, కర్రోల బాబు, రాజగళ్ల పద్మారావు, కర్రోళ్ల రాములు, కరోల శ్రీను, కర్రోల్ల ప్రవీణ్, కరోల్ల పద్మారావు, కుంటోళ్ల సాయిలు, భూమయ్య, కిషన్‌తో పాటు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్ద రామమందిరం సందర్శన

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని రామమందిరంలో సోమవారం జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ గురువైన, స్వామి సమర్థ్ స్థాపించిన రాములవారి విగ్రహం ఉన్న పెద్దరామమందిర్ పూజారి రామచంద్ర మహారాజ్ పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం ధర్మబిక్ష నిమిత్తం ఊరిలోని ఇండ్లను సందర్శించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గోవింద్ రావు, జోషి మహారాజ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## అఖండ హరినామ సప్తలో పాల్గొన్న భక్తులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని సీతయ్యపల్లి గ్రామంలో గత వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్త చివరి రోజు కావడంతో అఖండ హరినామ సప్త కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సప్త ముగింపు సందర్భంగా వమాన్‌రావు మహారాజ్ భక్తులకు కీర్తనలు చెప్పారు. గ్రామంలో భక్తులు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఏబీ స్విచ్‌కు మరమ్మతు

- నవతెలంగాణ కథనానికి స్పందించిన విద్యుత్ అధికారులు
- హర్షం వ్యక్తం చేసిన రైతులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట, మద్దికుంట గ్రామ శివారులోని మర్రి వద్ద గల పంట పొలాల్లో ఏబీ స్విచ్ మరమ్మతు పనులను విద్యుత్ అధికారులు సోమవారం చేపట్టారు. ఏబీ స్విచ్‌కు మరమ్మతు పనులు ఉండటంతో అధికారులు సామాను ఇవ్వకుండా, మరమ్మతు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని నవతెలంగాణలో సోమవారం "సామాను ఇవ్వరు.. మరమ్మతు చేయరు" అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సోమవారం ఏబీ స్విచ్ ప్రాంతంలో ముండ్ల పొదలను తొలగించి, విద్యుత్ శాఖ నుంచి సామగ్రిని తీసుకొచ్చి మరమ్మతు పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు అధికారులకు, నవతెలంగాణ దినపత్రికకు ధన్యవాదాలు తెలిపారు. మరమ్మతు చేసిన వారిలో విద్యుత్ అధికారులు రూరల్ ఏడీ నరేష్ కుమార్, ఏఈ లక్ష్మీనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మరమ్మతులు చేస్తున్న అధికారులు

నవతెలంగాణ ఎఫెక్ట్

## విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి

- లైన్‌మెన్ నిర్లక్ష్యంతోనేనంటూ గ్రామస్తులు, బంధువుల ఆందోళన




స్థంభంపైనే శ్రీనివాస్ మృతదేహం

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని రాంపూర్ గడ్డకు చెందిన యువరైతు పిట్ల శ్రీనివాస్ విద్యుత్ షాక్‌తో సోమవారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రాంపూర్ గడ్డకు చెందిన శ్రీనివాస్ (27)ను అదే గ్రామానికి చెందిన రమేష్ తన వ్యవసాయ పొలంలో బోరు మోటార్ వద్ద విద్యుత్ సరఫరా కావడం లేదని నియంత్రిక వద్ద మరమ్మతులకు తీసుకెళ్లాడు. లైన్మెన్ శంకర్ విద్యుత్ సరఫరా నిలిపివేయాలని కోరారు. నిలిపివేసిన అనంతరం శ్రీనివాస్ నియంత్రిక స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్న క్రమంలో తిరిగి విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో విద్యుత్ లైన్మెన్ నిర్లక్ష్యంతోనే రాంపూర్ గడ్డకు చెందిన యువ రైతు పిట్ల శ్రీనివాస్ మృతి చెందినట్లు బంధువులు, గ్రామస్థులు ఆరోపిస్తూ.. సోమవారం రాత్రి గాంధారి - బాన్సువాడ రహదారిపై పోతంగాల్ గేట్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనను విరమింపజేశారు.

## ఐదు తులాల బంగారం చోరీ

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని బొంకన్‌పల్లి గ్రామంలో ఐదు తులాల బంగారం చోరీ జరిగినట్లు ఇంఛార్జి ఎస్సై లస్మయ్య సోమవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. బొంకన్‌పల్లి గ్రామానికి చెందిన శారద అనే మహిళ గత రెండు రోజుల క్రితం కాళేశ్వరం టూరు వెళ్ళింది. సోమవారం వచ్చిచూసేసరికి ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయమే అదునుగా దొంగలు చోరీ చేసినట్లు ఇంఛార్జి ఎస్సై లస్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం

నవతెలంగాణ-లింగంపేట్

క్షయ వ్యాధి పట్ల ప్రజలు, రోగులు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి హిమబిందు సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆయా గ్రామాలలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గుతో బాధపడుతున్న వారు, సాయంత్రం పూట జ్వరమున్నవారు, అధిక బరువు తగ్గుతున్న వారు, నీరసంగా ఉండే లక్షణాలతో ఉండేవారు, ఉదయం పూట తెమడ సేకరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మందులు అందజేయనున్నట్టు ఆమె సూచించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ వ్యాధి వచ్చినవారు నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు జరగవచ్చునని తెలిపారు. ఇతరులకు కూడా వ్యాపించే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫరీదా బేగం, చంద్రకళ, యాదగిరి, ప్రదీప్, సుభాష్, సునీతతో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.



క్షయవ్యాధి దినోత్సవంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

# పోతాయిపల్లిలో పెద్దమ్మ బోనాలు

- ఘనంగా పెద్దమ్మ పెద్ద రాజుల కళ్యాణం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోతాయిపల్లి గ్రామంలో పెద్దమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పెద్దమ్మ తల్లికి ముదిరాజ్ కులస్తులు బోనాలు తీశారు. ఉదయం వేద పండితుల మధ్య పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణం నిర్వహించారు. గత రెండు రోజులుగా ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా ముదిరాజ్ కులస్తులు సాయంత్రం ఇంటింటికి బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పుసప్పుళ్లతో పోతరాజుల విన్యాసం, శివసత్తుల పూనకాలతో ఊరేగింపు కొనసాగింది. ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి ఒడి బియ్యం పోసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ ఆలయ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, ముదిరాజ్ కులస్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


బోనాల ఊరేగింపులో పాల్గొన్న ముదిరాజ్‌లు

# పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి

- కేంద్ర మంత్రిని కలిసిన రెంజల్ పొగాకు రైతులు

నవతెలంగాణ-రెంజల్

పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల రైతులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్‌ను సోమవారం కలిశారు. పొగాకును కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. బోర్గం గ్రామానికి చెందిన కొజ్జా గంగాధర్ ఆధ్వర్యంలో రైతులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మార్చి నెలలో తాము పండించిన పంటను విఎస్‌టి, ఇతర కంపెనీల వారు కొనుగోలు చేసే వారని, ఈ ఏడాది ఎవరూ కూడా ముందుకు రాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని వారన్నారు. ఆరుగాలం శ్రమించి పంటను పండిస్తే పొగాకు పంటను కొనుగోలు చేయడానికి ఎవరు ముందుకు రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ వారితో చర్చలు జరిపించి కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.


కేంద్రమంత్రికి విన్నవిస్తున్న రైతులు

## తహసీల్దార్‌ను సన్మానించిన నాయకపోడు సంఘం ప్రతినిధులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ తహసీల్దార్‌గా సురేష్ బాధ్యతలు చేపట్టడంతో జిల్లా నాయకపోడు సంఘం ప్రతినిధులు సోమవారం సన్మానించారు. కామారెడ్డి జిల్లా నాయకపోడు సేవా సంఘం అధ్యక్షులు మొట్ట పెంటయ్య, ప్రధాన కార్యదర్శి పుట్ట వెంకట్, కామారెడ్డి జిల్లా ఉద్యోగ సంఘం అధ్యక్షులు తడగొరి సాయిలు, జిల్లా సాంస్కృతి కార్యదర్శి పుట్ట బాలరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిర్నపల్లి సాయిలు, జిల్లా సలహాదారులు నూక సిద్దిరాములు, ముత్యాల అశోక్, కొత్తపల్లి బాలయ్య, నూక లక్ష్మణ్, మేడి సాయిలు, మచ్చ సంజీవులు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

## అంగవైకల్యాన్ని లెక్క చేయలే

నవతెలంగాణ-నిజామాబాద్

బోధన్ మండలం నాగన్ పల్లి గ్రామానికి చెందిన ఫణీంద్ర తనకు అంగవైకల్యం ఉన్న దాన్ని లెక్క చేయలే. చూస్తూ బాధపడలే. తనకున్న నాలుగు గేదేల పోషణ చేస్తూ పాలు,పెరుగు విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు.అంతేకాకుండా వేసవికాలం సందర్భంగ నాగన్ పల్లి బైపాస్ వద్ద ఎండలో గొడుగు పట్టుకుని కూర్చొని ఓ కుండలో చల్లని మజ్జిగ పోసుకుని విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. రహదారి వెంట వెళ్తున్న వాహనదారులు అక్కడ ఆగి చల్లని మజ్జిగ సేవించి వెళ్తున్నారు. నేటి యువతకు ఫణీంద్ర ఎంతో ఆదర్శం.


ఎండలో మజ్జిగ అమ్ముతున్న ఫణీంద్ర